క్లుప్తంగా

వర్సిటీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ బ్లాక్‌లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని తహసీల్దార్ టి.సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఎన్నికల కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.

డైట్‌లో వైజ్ఞానిక ప్రదర్శన


ప్రాజెక్టులను తిలకిస్తున్న డీఈవో పగడాలమ్మ

గార: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని వమరవల్లి ప్రభుత్వ డైట్‌లో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ ప్రాజెక్టులను పరిశీలించారు. వైజ్ఞానిక ప్రదర్శనను మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తిలకించారు. అలాగే విద్యార్థులకు డిబేట్, పేపర్ ప్రెజంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుమల చైతన్య, ఎంఈవో ఎ.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథుడ్ని దర్శించుకున్న సత్యాత్మతీర్థ స్వామి


శ్రీకూర్మనాథాలయంలో సత్యాత్మతీర్థ స్వామి

గార: ప్రముఖ విష్ణాలయం శ్రీకూర్మనాథుడ్ని ఉత్తర పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదులతో స్వామికి ఈవో జి.గురునాథం, ప్రధానార్చకు లు చామర్తి సీతారామనృసింహాచార్యులు స్వా గతం పలికారు. మూలవిరాట్‌ను దర్శించుకు న్న అనంతరం లక్ష్మీసన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు


స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవకొండ శంకర నారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత


సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: వెలగాడ పంచాయతీ చంద్రయ్యపేట గ్రామానికి చెందిన పిట్టా లీలావతి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయంగా రూ.పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని ఆమె కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లా జనార్దనరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ ఉన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతో మెరుగైన ఆరోగ్య సాధ్యమని శ్రీచైతన్య స్కూల్స్ రీజినల్ ఇన్‌స్పెక్టర్ శీపాన రామినాయుడు అన్నారు. స్థానిక మహాలక్ష్మీనగర్ కాలనీలోని శ్రీచైతన్య స్కూల్ యాన్యువల్ స్పోర్ట్స్ డే వేడుకలు ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల ప్రాంగణంలో జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటపాటలను నిర్వహించి.. విజేతలకు బహుమతులను అందజేశారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన


సస్యరక్షణ కోసం రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి: వరినారు చిగుర్లు తుంచడం వల్ల కాండం తొలుచు పురుగు నివారణ సాధ్యపడుతుందని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలిపారు. మండలంలోని రొట్టవలస గ్రామంలో ఆలస్యంగా వేస్తున్న వరినాట్లు పొలాలను బుధవారం పరిశీలించారు. ఆలస్యంగా నాట్లు వేయడం వల్ల తెగుళ్ల ఆశించే ప్రమాదముందన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి

● ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పని చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన జి.సిగడాం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారన్నారు. స్థానిక సంస్థల పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, పట్టభద్రుల స్థానం అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని వాటిని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. సీఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్లు ఏర్నేన ప్రకాశరావు, పల్లేటి సన్యాసిరావు, వైస్ ఎంపీపీలు మీసాల సాద్వీమణి, తోలేటి వెంకటరావు, స్థానిక సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ, నాయకులు బూరాడ వెంకటరమణ, నక్క ప్రసాదరావు, వెలిది సాయిరాం, మహదాస్యం నారాయణరావు, పిల్లల శివకుమార్, పున్నాన అక్కలనాయుడు, శిల్లా రెడ్డి, కన్నంనాయుడు పాల్గొన్నారు.

సక్రమంగా ఉపాధి పనులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ లోకేష్

లావేరు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను సక్రమంగా చేయించాలని ఏపీడీ లోకేష్ అన్నారు. లావేరులోని ఉపాధి హామీ కార్యాలయంలో టీఏలు, ఎఫ్ఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించడంతో పాటు జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించాలన్నారు. చేపట్టే పనులను టీఏలు, ఎఫ్ఏలు రోజూ పర్యవేక్షణ చేయాలన్నారు. జేఈ లెనిన్‌బాబు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

బెజ్జిపురం గ్రామంలోని మహారాజా సాగరం చెరువులో జరుగుతున్న పనులను ఏపీడీ లోకేష్ పరిశీలించారు. పనులకు వచ్చే వేతనదారుల మస్టర్లు జాబితాలను తనిఖీ చేశారు. రోజుకు రెండు పూటలా ఆరు గంటలు పనిచేస్తేనే ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట వేతనం 257 రూపాయలు గిట్టుబాటు అవుతోందని వేతనదారులతో అన్నారు.

జనరిక్ మందుల వినియోగంపై అవగాహన


జన ఔషధీ కేంద్రం వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి భారతీయ జనఔషధీ పరియోజన (జనరిక్ మెడికల్ స్టోర్స్) ఐదో వార్షికోత్సవం బుధవారం జరిగింది. బుధవారం నుంచి ఈ నెల ఐదో తేదీ వరకు వివిధ రకాల కార్యక్రమాలతో జనరిక్ మందుల వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. జనరిక్ మందులు చాలా నాణ్యమైనవన్నారు. సరసమైన ధరలకు లభిస్తాయని, చక్కెర, బీపీ, గ్యాస్ట్రో, ఇతర దీర్ఘకాలిక రోగాలకు అన్నిరకాల మందులు లభిస్తాయని చెప్పారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా జన ఔషధీ కేంద్రం నుంచి రెడ్‌క్రాస్ వలంటీర్లు, జన ఔషధీ లబ్ధిదారులు, ఇతర వ్యక్తులతో అవగాహన ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు జెండా ఊపి చైతన్య రథాన్ని ప్రారంభించారు. ఈ రథం ద్వారా వివిధ కూడళ్ల వద్ద జనరిక్ మందులపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరసింగరావు, కె.సత్యనారాయణ, బి.శ్రీధర్, బి.సతీష్, బేగం, ఫార్మసిస్టు ప్రియాంక పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

జన ఔషధీ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు www.mygov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి తమ పేర్లు నమోదు చేసుకొని పాల్గొని ఆన్‌లైన్‌లో ఉన్న క్విజ్‌కు జవాబులు ఆన్‌లైన్‌ద్వారా పంపాలన్నారు. ఈ అవకాశం ఈనెల 4తేదీ వరకు ఉంటుందన్నారు.

పింఛన్ల అందజేత


పింఛన్లను అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నగరంలోని 27వ వార్డు పరిధిలోని వాంబే కాలనీకి చెందిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఈ నెలకు మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హత గల ప్రతిఒక్కరికీ 2750 రూపాయలను పింఛన్‌గా అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. నవరత్నాలను శత శాతం అమలు చేశారన్నారు.

గూనపాలెంలో..


పింఛన్లు అందజేస్తున్న శోభన్

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని 12వ డివిజన్ గూనపాలెంలో డివిజన్ ఇన్‌చార్జి ఇ.శోభన్, డివిజన్ వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు ఉన్నారు.

నాగరత్నం పేరంటాలకు పూజలు

లావేరు: కేశవరాయునిపురం గ్రామంలోని నాగరత్నం పేరంటాలు ఆలయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో పేరంటాలకు భక్తులు ప్రత్యేక పూజలు జరిగాయి. కేశవరాయునిపురం, లావేటిపాలెం, గుర్రాలపాలెం గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అల్లంపల్లి అప్పారావు, నారాయణరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశీల వసూళ్లకు 9న బహిరంగ వేలం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని మార్కెట్, రోడ్డు మార్జిన్లలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆశీలు వసూలు చేసేందుకు ఏజెన్సీ ఎంపిక కోసం ఈ నెల 9న నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ మేరకు నగరపాలకసంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.10 లక్షలు సాల్వెన్సీ, రూ.3 లక్షలు దరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో హెచ్చు పాటదారునికి మార్కెట్స్, రోడ్డు మార్జిన్స్‌లో (7 విలీన గ్రామ పంచాయతీలతో సహా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31వ తేదీవరకూ ఆశీలు వసూలు చేసుకునే హక్కులు కల్పిస్తామన్నారు.

భావితరాలకు సమరయోధుల స్ఫూర్తి తెలియాలి

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న మందిర కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: భావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తి తెలియాల్సిన అవసరం ఉందని సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న మహాత్మాగాంధీ మందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనాన్ని బుధవారం ఆయన సందర్శించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మీనారాయణను మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్, ఎస్.ఎస్.గుప్త, మహిబుల్లాఖాన్ తదితరులు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్మృతివనం వద్ద 105 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించడం, ఎందరో సమరయోధులు, సంఘ సంస్కర్తల విగ్రహాలను మందిరంలో ఏర్పాటు చేసి వారి జీవిత విశేషాలను నేటితరానికి తెలియజేయడం ప్రశంసనీయమన్నారు. మందిర కమిటీ ప్రతినిధులకు సహకరించిన జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసులను అభినందించారు. నిత్యం పర్యవేక్షించే కేర్ టేకర్ రాజారావుకు నగదు పారితోషకాన్ని అందజేశారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


లావేరు: విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లావేరు: గ్రామాల్లో ఏర్పాటు చేసే 104 వాహనం వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదలింగాలవలస పంచాయతీ సర్పంచ్ లుకలాపు యశోద అన్నారు. గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 104 వాహన వైద్యులు, సిబ్బంది, సచివాలయం ఏఎన్ఎంలు శిబిరానికి వచ్చిన వారికి తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. సచివాలయం ఏఎన్ఎం సుజాత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు వైద్యసేవలు

జి.సిగడాం: స్థానిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వృద్ధులు, గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య తనిఖీలు చేసి మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారి యశ్వంత్ మాట్లాడుతూ.. వేసవి నేపథ్యంలో అధికంగా నీరు తాగాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పథంలో రణస్థలం

● ఎంపీపీ పిన్నింటి రజిని


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజిని

రణస్థలం: అభివృద్ధి పథంలో రణస్థలం మండలం ప్రయనిస్తోందని ఎంపీపీ పిన్నింటి రజిని అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులను వివరించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని గ్రామాల్లో కుటుంబ ఆరోగ్య సమీక్షపై సర్వే చేస్తున్నామన్నారు. అంగవైకల్యం ఉన్నప్పటికీ సదరం సర్టిఫికెట్ జారీలో చాలామందికి అన్యాయం జరుగుతుందని, గ్రామాల్లోకి ఏఎన్ఎంలు రావటం లేదని క్రిష్టాపురం ఎంపీటీసీ సభ్యుడు రామినాయుడు వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రక్త నిల్వలు నిండుకున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేసేలా దాతలు ముందుకు రావాలని రిమ్స్ వైద్యులు కోరారు. కమ్మసిగడాం పంచాయతీ పరిధిలోని పాఠశాలలను 'నాడు-నేడు' పథకం ద్వారా అభివృద్ధి చేయాలని సర్పంచ్ కోరారు. ఏఈ కూర్మనాథం మాట్లాడుతూ.. మండలంలో పెండింగ్‌లో ఉన్న రూ. 7 కోట్ల 'నాడు-నేడు' పథకం పనులకు సంబంధించిన బిల్లులు త్వరలో వస్తాయని చెప్పారు. జూన్ నెల లోగా తోటపల్లి కాలువ పనులు పూర్తి చేసి సాగునీరు మండలానికి వచ్చేలా కృషి చేయాలని సభ్యులు తోటపల్లి ప్రాజెక్టు ఏఈ రామలక్ష్మిని కోరారు. రణస్థలం పంచాయతీలోని జగనన్న కాలనీ పట్టా మంజూరు చేసిన 40 మందికి స్థలం అప్పగించాలని రణస్థలం పంచాయతీ సర్పంచ్ పిన్నింటి భానోజి నాయుడు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, ఎంపీడీవో వి.ధనుంజయరావు, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల ప్రత్యేకాహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న నాయకులు

లావేరు: వెంకటాపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా స్వామి వారిని తమలపాకులు, నిమ్మకాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు వెంకటాపురం పంచాయతీ సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింహులు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలాపు అప్పలనాయుడు, గోవిందపురం మాజీ సర్పంచ్ గొర్లె రామినాయుడు, వార్డు మెంబరు ఇప్పిలి క్రిష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు యందవ శ్రీనివాసరావు, మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.

రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ మృతి


భానుప్రకాష్‌రెడ్డి (ఫైల్)

మెళియాపుట్టి: మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కప్ప భానుప్రకాష్‌రెడ్డి (48) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. డైరెక్టర్‌గా రెండేళ్లుగా బాధ్యతలు నిర్వహించారు. మరలా రాష్ట్ర ప్రభుత్వం పదవీకాలాన్ని గత నెల 22న మరో రెండేళ్లు పొడిగించింది. గతకొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒడిశా, ఆంధ్ర రాష్ట్రాల్లో పలు భజనల్లో ఈయన ఏర్పాటు చేసిన వేణుగోపాల భజన బృందం ప్రదర్శనలు చేసేంది. మెళియా పుట్టిలో జరిగే డోలో యాత్రలో అనేక పౌరాణిక, జానపద కార్యక్రమాల నిర్వహించడానికి కృషిచేసేవారు. మరో వారం రోజుల్లో డోలోత్సవాలు ప్రారంభంకానున్న సమయంలో ఈయ న మృతి గ్రామస్తులను కలచివేసింది. ఈయనకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మరో అవకాశం ఇవ్వండి


విద్యావేత్తలతో చర్చిస్తున్న సోము వీర్రాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీవీఎన్ మాధవ్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి మరోసారి గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు కోరారు. బుధవారం శ్రీకాకుళం పర్యటనకు వచ్చిన ఆయన శ్రీకాకుళంలోని సాయి విద్యామందిర్ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, చింతపల్లి దుర్గారావు గాంధీ, గంగు శ్రీదేవి, సూర్యకుమారి, గుజ్జల రాజు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

శ్రీకాకుళం న్యూకాలనీ: సైన్స్ పురోగాభివృద్ధికి బాటలు వేసిన సర్ సీవీ రామన్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కాకినాడ ఆదిత్య కళాశాలల శ్రీకాకుళం డైరెక్టర్ బరాటం శ్రీనివాస చక్రవర్తి అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో డిగ్రీ కళాశాలలో రెండు రోజులు జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సీవీ రామన్ భౌతిక శాస్త్రంలో భారతదేశం తరఫున తొలి బంగారు పతకం సాధించిన వ్యక్తిగా చరిత్ర పుటల్లో నిలిచారని గుర్తు చేశారు. ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

రంగనాథస్వామి రజతోత్సవ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండల కేంద్రంలోని పద్మాధాత్రి సమేత రంగనాథ స్వామి దేవాలయం రజతోత్సవ వేడుకలు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను బుధవారం రాత్రి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, స్థానిక సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కీర్తి తవుడమ్మ పాల్గొన్నారు. వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని రంగనాథస్వామి సేవా సమితి సభ్యులు నాగేశ్వరరావు, నారాయణరావు, సాయిరాం, నాగరాజు, ప్రసాదరావు, జగ్గు, రాము తెలిపారు.

ముగిసిన ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు


కొత్తూరు: పూజలు అందుకుంటున్న ఎల్లమ్మతల్లి

పాతపట్నం: మండలంలోని గురండి గ్రామంలో ఉన్న ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం రాత్రి ఎమ్మెల్యే రెడ్డి ఎల్లమ్మ తల్లిని దర్శించుని పూజలు చేశారు. గత మూడు రోజుల నుంచి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అరటి గెలలతో ఆలయాన్ని అలంకించారు. మహిళలు ముర్రాటాలతో మొక్కులను చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎనుగుతల సూర్యం, సర్పంచ్ తులసీనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా జామి జాతర

పాతపట్నం మండలంలోని కొరసవాడ గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి ఆలయంలో జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల నుంచి భక్తులు జోగి దండి, అమ్మవారికి ప్రీతికరమైన వంటలను పెట్టి పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు, పోలీసులు, సర్పంచ్ ఉమ, ఎంపీటీసీ సుగుణ చర్యలు తీసుకున్నారు.

పోతన్న, ఎల్లమాంబలకు పూజలు

కొత్తూరు: నివగాంలో బుధవారం ప్రారంభమైన జామి యాత్రలో పోతన్న, ఎల్లమాంబకు భక్తులు విశేష పూజలు చేశారు. ఇంటింటా జోగి దండిన బియ్యాన్ని ఎల్లమాంబకు సమర్పించారు. ఐదు రోజుల పాటు యాత్ర నిర్వహించనున్నారు. పలు ఆధ్యాత్మిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయంతో రైతులుకు మేలు కలుగుతుందని, తక్కువ పెట్టుబడితో రైతులే తయారు చేసుకునే మీనామృతాన్ని మొక్కలకు వేస్తే పెరుగుదల ఉంటుందదని ప్రకృతి వ్యవసాయం మండల ఎన్ఎఫ్ మెట్ట పద్మావతి అన్నారు. మండలంలోని యంబరాం గ్రామంలో బుధవారం మీనామృతం తయారీపై రైతులకు అవగాహన కలిగించారు. మూడు కిలోల చేపల వ్యర్థాలు, మూడు కిలోల బెల్లాన్ని మూడు లీటర్ల నీటిలో కలిపి మీనామృతం తయారు చేసుకోవచ్చన్నారు. ఐసీఆర్పీ పవన్ ఉన్నారు.

గులిరాగి పద్ధతులపై అవగాహన

హిరమండలం: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని సీది గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.రేవతి, కొత్తూరు వ్యవశాయశాఖ ఉప సంచాలకులు రాజగోపాలరావు గులిరాగి పద్ధతులపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎం.అలివేలు మంగ మహిళా రైతు పొలంలో సాగు చేస్తున్న చిరుధాన్యాల సాగును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి పొందేందుకు అనసరించాల్సిన పద్ధతులను వివరించారు.